మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-అరకులోయ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని నిరూపించుకున్నాడు ఓ వ్యక్తి. ఏదైనా ఫంక్షన్ కి వెళ్ళినప్పుడు చదివించి రావడం అనవాయితీ. ఫంక్షన్లో కొంతమంది రిటన్ గిఫ్టులు ఇవ్వడం సహజం. మండలంలోని కొత్త బల్లుగూడ గ్రామానికి చెందిన ఓ వ్యాపారి అందుకు భిన్నంగా ఫంక్షన్ కి వచ్చిన ప్రతి ఒక్కరికి రిటర్న్ గిఫ్టుగా శాండిల్ వుడ్ మొక్కలు పంపిణీ చేసి పర్యావరణం పై తనకున్న ప్రేమను చాటుకున్నాడు. బల్లుగూడ గ్రామానికి చెందిన కుసుమంచి అవేష్ కుమార్ అనే వ్యాపారి తన కుమార్తె రజస్వల ఫంక్షన్ సందర్భంగా భోజనానికి వచ్చిన గిరిజనులకు గిఫ్ట్ తో పాటు, మొక్కలు పంపిణీ చేశారు.

మొక్కలను అందజేస్తున్న వ్యాపారి

గిరిజనులకు నోటీసులు అన్యాయం

- అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

మాట్లాడుతున్న గంగరాజు

ప్రజాశక్తి హుకుంపేట:- ఆదివాసుల నిర్మాణాలపై అందజేసిన నోటీసులను వెనక్కు తీసుకోవాలని అనంతగిరి జెడ్పిటిసి దీసారి గంగరాజు డిమాండ్ చేశారు. గిరిజనేతరులు 1/70 చట్టం ఉల్లంఘించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని అయన డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గురువారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సెక్షన్-7 నోటీసులు ఇచ్చిన ఆదివాసులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ హుకుంపేట మండలం గ్రామంలో ఆదివాసులు నిర్మించుకున్న నిర్మాణాలపై 58 మందికి నోటీసులు ఇచ్చి కాళీ చేయమనడం దుర్మార్గమన్నారు. రెవెన్యు అధికారులు అందజేసిన సెక్షన్ 7 నోటీసులు వెనక్కి తీసుకోవాలన్నారు. 5వ షెడ్యూల్డు భూభాగం, భూ బలాయింపు నిషేధం 1/70 చట్టం, ఎల్టీఆర్, పీసా చట్టాలు అమలులో ఉందని, ఇక్కడ సర్వహక్కులు అధివాసులదే సర్వహక్కులు ఉన్నాయన్నారు. హక్కు పత్రాలు లేనివారికి హక్కుపత్రాలు అందజేయాలని ఆయన అన్నారు. అభివృద్ధిలో భాగంగా రోడ్డుకి ఇరువైపుల నిర్మించిన వాటిని తొలగించాలని అందజేసిన నోటీసులపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. రోడ్డు విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని ఆయన కోరారు. గిరిజనేతరులు రోడ్డు కిరువైపులా కట్టుకున్న 36 అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. నోటీసులు ఇచ్చినా కనీసం స్పందించని గిరిజనేతర అక్రమ నిర్మాణాలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండలం గిరిజన సంఘం, ఆదివాసి మహిళ సంఘం తదితరులు పాల్గొన్నారు.

జిసిసి ఛైర్మన్ ఆకస్మిక పర్యటన

-పెట్రోల్ బంక్, గొడౌన్‌ల తనిఖీ

బంక్‌ను తనిఖీ చేస్తున్న జిసిసి ఛైర్మన్ శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి -జిమాడుగుల: జి.మాడుగుల మండల కేంద్రంలో జీసీసీ గోడౌన్, పెట్రోల్ బంక్‌లను రాష్ట్ర జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ తనిఖీ చేసారు జీసీసీ గోడౌన్ ధీలావస్థలో ఉండటంతో వెంటనే మరమ్మతు చేయడానికి ఎంత ఖర్చు అవుతుందో ఎస్టిమేషన్ వేయాలని డిఎంను ఆదేశించారు. అనంతరం పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు. పూర్తి స్థాయిలో రికార్డులు, సేల్స్ రిజిస్టర్, బిల్లులు లేక పోవటంతో ఆగ్రహం వ్యక్తం చేసారు. టార్బో ఆయిల్, డీజిల్ ఇంజిన్ అయిల్స్ బిల్లులు అడగ్గా సిబ్బంది మౌనం వహించారు. వెంటనే డిఎంను పిలిచి ఎన్ని సంవత్సరాలు నుండి విధులు నిర్వర్తిస్తున్నారని, గోడౌన్స్ తనిఖీ చేయడం లేదా అని ప్రశ్నించారు. పెట్రోల్ బంక్ ద్వారా నెలకి కోటి అరవై లక్షలు నుండి కోటి ఏనబై లక్షలు రాబడి వస్తుందన్నారు. వెంటనే పెట్రోల్ ట్యాంక్ రిపేరు చేయాలని సూచించారు. అనంతరం ఉబ్బలగరువు గ్రామంలో కాఫి రైతులతో సమావేశమై కాఫీ ధరలను వివరించారు. గత ప్రభుత్వంలో కాఫీ ధర రూ.280 ఉండేదని, టీడీపీ కూటమి ప్రభుత్వంలో 320లకు కొనుగోలు చేస్తున్నామన్నారు. అరబిక్ 150 ఉన్న దానికి 170, రోబాస్ట 80 ఉన్న దానికి 100 చేశామని తెలిపారు. రైతులు దళారుల నుండి మోసపోకుండా జీసీసీ సిబ్బంది క్లస్టర్ మీటింగ్‌లు పెట్టి అవగాహనా కల్పించాలన్నారు. ఉబ్బలగరువు గ్రామంలో జీసీసీ కాఫీ కొనుగోలును శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాడేరు అసెంబ్లీ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి, టూరిజం డైరెక్టర్ కిల్లు రమేష్ నాయుడు, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సొమెలి చిట్టీ బాబు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి బాకూరు వెంకటరమణ రాజు,ఎంపీపీ కృష్ణ మూర్తి నాయుడు, హుకుంపేట మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి పాల్గొన్నారు

గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలం బస్కి పంచాయితీ పివిటిజి గ్రామమైన బిజ్జగూడలో గిరిజనులు తీవ్ర సమస్యలతో సతమతమవుతునట్లు సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, మండల నాయకులు తెలిపారు. గురువారం బిజ్జగూడ గ్రామంలో పర్యటించి గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. బిజ్జగుడ గ్రామంలో సుమారు 32 పీవీటిజి కుటుంబాలు నివసిస్తున్నారని, కనీసం సిసి రోడ్డు, డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్, అంగన్వాడి భవనం కుడా లేని పరిస్థితి ఉందని అన్నారు. విద్యుత్ స్తంభాలు లేక వీధిలైట్లు వెలగక ప్రతిరోజు అంధకారంలో మగ్గుతున్న పరిస్థితి ఉందన్నారు. అంగన్వాడి భవనం లేక అద్దె భవనంలో సెంటర్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏడు కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు కాలేదన్నారు.తాగు నీరు ట్యాంక్ వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సోడపల్లి ఆనందరావు, దేవన్న, సుబ్బారావు, సత్యారావు, రామచందర్, గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటనపై ఆందోళన

ప్రజాశక్తి-జిమాడుగుల: బాలికపై అత్యాచార ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్కూల్ యజమాన్యం పై తక్షణమే చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాలు జి.మాడుగుల ఆశ్రమ పాఠశాల ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు మాట్లాడుతూ, విద్యార్థులకు రక్షణగా ఉండవలసిన అధికారులే బాలికను చూడకుండా అసత్య ఆరోపణలు చేయటం చాలా దుర్మార్గమన్నారు. స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే ఈ ఘటన జరిగిందన్నారు. ఈ విషయంపై అధికారుల చుట్టూ తిరిగినా తమకు న్యాయం చేసే పరిస్థితిలో అధికారులు లేకపోవడం బాధాకరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆపే పరిస్థితి లేదని, తల్లిదండ్రులు తేల్చి చెప్పారు. ఈ ఘటనపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత అధికారులు ఒక ప్రత్యేకమైన విచారణ కమిటీ ఏర్పాటు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమం ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, మహిళా సంఘం నాయకులు లత కుమారి, కెజియరాని, విమల, రవణమ్మ, గిరిజన సమాఖ్య జిల్లా సహకారదర్శి సభ్యుల సెగ్గే లక్ష్మణ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ. సిహెచ్ మత్యరాజు గోవిందరావు, గోపాల్. తదితరులు పాల్గొన్నారు

ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, నాయకులు

రాళ్లపై నడిచి వెళుతున్న గిరిజనులు

రోడ్డు సౌకర్యం కల్పించరూ..

ప్రజాశక్తి-అనంతగిరి: మారుమూల గిరిజన గ్రామాలకు డోలీ రహిత గ్రామాగా తీర్చిదిగేందుకు ఉమ్మడి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సంకల్పిం చిందని, రోడ్డు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల. పవన్ కళ్యాణ్ ప్రకటించిన హామీలు ఎక్కడా అమలకు నోచుకోలేదని గిరిజనులు కొండలు గెడ్డలు వాగులు వంకలు దాటుతూ ఆందోళనకు దిగారు. మండలంలోని మారుమూల పెద్దకోట పంచాయతీ పరిధి చట్టకంబ గ్రామానికి చెందిన గిరిజనులు గురువారం రోడ్డు సౌకర్యం కల్పించాలని ఊరూరా కదులుతూ తమ నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రంలో ఉన్న గిరిజన గ్రామాలకు డోలి రహిత గ్రామాలుగా తీర్చిదిదెందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లక్ష్యంగా తీసుకుందని సమీపంలో ఉన్న పినకోట పంచాయతీ పర్యటనకు వచ్చి పవన్ కళ్యాణ్ వాగ్దానాలు చేసారె తప్ప నేటికీ తమ పిన్నకోట. జీనబాడు, పెద్దకోట, కివర్ల పంచాయతీ మారుమూల గ్రామాలకు కనీసం రోడ్డు లేక గర్భిణీలు, బాలింతలు, రోగులను కిలోమీటర్ల దూరం డోలి సహాయంతో వైద్యం కోసం ఆసుపత్రికి తరలిస్తున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాటను కట్టుబడి రోడ్డు సౌకర్యం కల్పించి డోలీ మోతలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని గిరిజనులు కోరుతున్నారు. గ్రామస్తులు నీలన్న, .భీమరాజు, లచ్చన్న. గిరిజనులు పాల్గొన్నారు.

జాయింట్ సర్వేను వేగంగా పూర్తి చేయండి

-జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి-పాడేరు: అధికారులు, నెట్ వర్క్ ఆపరేటర్లు సంయుక్తంగా జాయింట్ సర్వే పూర్తి చేసి సెల్ టవర్ల నిర్మాణాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ సూచించారు. గురువారం ఆయన కార్యాలయం నుండి అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు, బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్ టెల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెల్ టవర్ల నిర్మాణానికి ఎదరవుతున్న స్థలాల సమస్యలను అధికారులు సమన్వయంతో జాయింట్ సర్వే చేసి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. సర్వే రిపోర్టులు వెంటనే సమర్పించాలని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారుల సమన్వయంతో పనిచేయాలని బి. ఎన్. ఎన్. ఎల్ అధికారులకు సూచించారు. కొయ్యూరు మండలంలో 6 సైట్ల సమస్యలు ఉన్నాయని, హుకుంపేట మండలం 1 ఉన్నాయని బి ఎన్ ఎన్ ఎల్ అధికారులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. స్థల సమస్యలను పరిష్కరించాలని సబ్ కలెక్టర్, తహాశీల్దారులకు తెలిపారు. జియో సెల్ టవర్ల నిర్మిణానికి ఇంకా 14 టవర్లకు అనుమతులు ఇవ్వాలని జియో అధికారులు కోరారు. వీటిలో 8 అనుమతులు ఫారెస్టు శాఖ నుండి రావాల్సి ఉందన్నారు. పెండింగ్ జాయింట్ సర్వేలు వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. అధికారులు సక్రమంగా సహకారం అందించకపోతే తమ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇలు కె. వేణుగోపాల్, జి. డేవిడ్. పంచాయతీ రాజ్ ఇ ఇ టి. కొండయ్య పడాల్, జియో, ఎయిర్ టెల్, బి ఎస్ ఎన్ ఎల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి

రహదారి నిర్మాణం వేగవంతం చేయాలి

కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-సీలేరు

జికె.వీధి మండలం సప్పర్ల నుండి అమ్మవారి దారకొండ మీదుగా దుర్గం గొల్లపల్లి వరకు నిర్మిస్తున్న రహదారి నిర్మాణం పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీకే వీధి మండలం సప్పర్ల, దారకొండ, చట్రాపల్లి తదితర గ్రామాలను గురువారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి నిర్మాణం పూర్తయితే పలు గ్రామాలకు రవాణా సౌకర్యం కలుగుతుందని, యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ఆయా గ్రామాల ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. సప్పర్లలో గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడి ఆయా గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని గుర్తించిన కలెక్టర్ ఆసమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చట్రాపల్లి సందర్శనలో గ్రామస్తులు మాట్లాడుతూ ఇప్పటికీ కొండ చరియలు పడతాయనే భయంతో ఉన్నామని, వీలైనంత త్వరగా సురక్షిత ప్రాంతంలో గృహాలు నిర్మించి అందజేయాలని కోరారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ అందుకు గల అవకాశాలను పరిశీలించి నివేదిక అందజేయాలని అధికారులును ఆదేశించారు. సప్పర్ల ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యశాల గురించి ఆరా తీశారు. రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, కాఫీ పల్పింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో జీకే వీధి తహసీల్దార్, ఎంపీడీవో, పిఐయు ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ అప్పల సూరి, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

కాఫీ పల్పింగ్ కేంద్రంలో కాఫీ పిక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మృతి చెందిన ఉపాధ్యాయుని కుటుంబానికి యుటిఎఫ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) సామాజిక సేవలో భాగంగా ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయుడి కుటుంబానికి రూ.3 లక్షలు ఆర్థిక సహాయం అందజేసింది. యుటిఎఫ్ సభ్యునిగా ఉన్న దూడ ఫ్రాన్సిస్ ప్రేమ కుమార్ గ్రేడ్-2 హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబానికి యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం నుండి రూ.3లక్షలు చెక్కును రంపచోడవరం యూటీఎఫ్ హోమ్‌లో గురువారం అందజేశారు. ఈసందర్భంగా యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ ఎగ్జిక్యూటివ్ బోర్డు డైరక్టర్, సంఘం ఏఎస్ఆర్ జిల్లా కోశాధికారి గడిపె విశ్వరాజ్ మాట్లాడుతూ యుటిఎఫ్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా శాఖ అనగా 'ది గోదావరి యూటీఎఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్'ను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభించినప్పటి నుండి ఇప్పటివరకు దాదాపు 360 మంది మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబాలకు సంఘీభావంగా రూ.7 కోట్లు ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కారం సూరిబాబు మాట్లాడుతూ కరోన మొదటి దశలో మొత్తం 48 మంది చనిపోతే వారి కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున కోటీ 44 లక్షల రూపాయలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు సనాతనబాబు, జిల్లా కార్యదర్శి వెంగళరావు ఆదిరెడ్డి, పండు దొర, డిపి లింగన్న, పుట్టపల్లి రాజు, కృష్ణారెడ్డి, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

కోలాటంలో జెడ్‌పి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

కాకినాడ జెఎన్‌టియులో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి క్రియ పిల్లల పండుగలో జరిగిన భాగంగా జరిగిన కోలాటం పోటీల్లో రాజవొమ్మంగి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పాఠశాలకు చెందిన సుమారు 60 మంది విద్యార్థినీ, విద్యార్థులు చిత్రలేఖనం, జానపద నృత్యం, స్పెల్లింగ్, మ్యాప్ పాయింటింగ్, కథ చెప్పడం, కథా రచన, ఏక పాత్రాభినయం, వ్యాస రచన, మట్టి బొమ్మలు చేయుట, కోలాటం, అంతర్జాలంలో అన్వేషణ, క్విజ్ తదితర పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో కోలాటంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుపొందారు. ఈ మేరకు గురువారం పాఠశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డివి.గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి పోటీల్లో పాల్గొనడం వలన పోటీతత్వం అలవడుతుందని తెలిపారు. ఈ పోటీలకు తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులు మిరియాల కొండబాబు, చింతోజి శివకృష్ణ, వి.రాజమ్మలను, విద్యార్థులను, హెచ్‌ఎంతో పాటు పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ మరిచర్ల శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ చీడి వెంకట రమణ, సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్‌వివిఎస్ఎన్.మూర్తి, పి.పోసిబాబు, కె.సత్యంబాబు, ఎస్.అప్పారావు, విఘ్నేశ్వరరావు, శాంతి ప్రియ, కె.జయలక్ష్మి, ఇ.ఏసుకుమారి, ఆర్.వెంకట రమణ, జి.సూర్యనారాయణ, జి.వెంకటరమణ, ప్రసాద్ రెడ్డి, గంగాభవాని, ఎ.అప్పారావు, పాల్‌బాబు, రేష్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-రంపచోడవరం

అడ్డతీగల మండలం పరిధి ధాన్యంపాలెం, సోమన్నపాలెం, డి.భీమవరం పంచాయతీలకు చెందిన 250 కుటుంబాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవీ టిడిపి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ ఎంపీటీసీ నడిపల్లి లోవరాజు, వైస్ ప్రెసిడెంట్ మాకవరపు సత్యనారాయణ, వార్డు మెంబర్లు అన్నిక లక్ష్మి, లోత లింగేశ్వరి, రాయుడు వెంకట కృష్ణ, ఎం.బాబురావు, మాగంటి సత్తిబాబు, మాకవరపు సూర్యనారాయణ, ఎం.ఎల్లారావు, చెక్క రామయ్యమ్మ, మాకవరపు అఖిల, తోకల నాగేశ్వరరావు, కె.శ్యామలరావు, చల్లా సాంబశివరావు, దాగర లక్ష్మి కాంతం, వాసిరెడ్డి చంద్రావతి, కె.దుర్గ, వీరకోట నారాయణమ్మ, బచ్చల సరస్వతితో సహా మూడు పంచాయతీల నుంచి 250 కుటుంబాలు టిడిపిలో చేరినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఎమ్మెల్యేగా తను రంపచోడవరం నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వారు టిడిపిలో చేరినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఎప్పటినుంచో రోడ్డు సదుపాయం సక్రమంగా లేని అడ్డతీగల నుంచి డి.భీమవరం మీదుగా రాజవొమ్మంగికి వెళ్లే రహదారికి తారు రోడ్డును మంజూరు చేసినట్లు చెప్పారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మఠం విజయ భాస్కర్ మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు మాదిరిగా తాము హత్యా రాజకీయాలు చేయబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి అడ్డతీగల మండల నాయకులు బీర బాలయోగి, రంపచోడవరం మండల నాయకులు పెంటపాటి అనంత మోహన్, సలాది బాపురాజు, మాజీ సర్పంచ్ వై నిరంజనీ దేవి, కంభం కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శిరీషాదేవి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

డిఇఒకు సన్మానం

ప్రజాశక్తి-సీలేరు

జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు గురువారం జికె.వీధి మండల కేంద్రానికి విచ్చేసిన సందర్భంగా ఆయన్ను భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు డివి.కాళేశ్వరరావు మాట్లాడుతూ జీకే వీధి మండలంలో పీసా కమిటీల స్పెషల్ ఆఫీసరుగా డిఇఒ నియమితులైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లోచల రామకృష్ణ, మాజీ అధ్యక్షులు ఎం.వెంకటరమణ, చింతల విద్యాసాగర్, జీకే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు తగ్గి సత్యనారాయణ, కె.రామన్న తదితరులు పాల్గొన్నారు.

డిఇఒ బ్రహ్మాజీరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు

యుటిఎఫ్, పిఆర్‌టియు కేలండర్లు ఆవిష్కరణ

డుంబ్రిగుడలో కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలో యుటిఎఫ్ 2025 క్యాలెండర్, డైరీలను గురువారం స్థానిక మండల విద్యాశాఖ అధికారి ఎస్.సుందర్రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ నిరంతరం పని చేస్తుందని ఆయన చెప్పారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వి.మహేశ్వరరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యలతో పాటు ప్రభుత్వ విద్యా విధానం ప్రైవేటీకరణ కాకుండా ప్రభుత్వమే నడిపించే విధంగా యుటిఎఫ్ పని చేస్తుందని చెప్పారు.. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ కన్నయ్య, ఆడిట్ కమిటీ సభ్యుడు ఎల్.నారాయణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలకృష్ణ, రాజారావు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘం 2025 క్యాలెండర్, డైరీలను స్థానిక మండల ఎంఈఓ ఎస్.సుందర్రావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యలపై పి ఆర్ టి యు పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఎం,శ్రీనివాస్, రామ్ చందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో గురువారం ఎపిటిఎఫ్ క్యాలండర్‌ను ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన యూనియన్ మండల అధ్యక్షులు మాలం నాయుడు, కార్యదర్శి చెండా పంతులుబాబు, విద్యాశాఖాదికారి 1 కొమ్ము కృష్ణ మూర్తి , గుమ్మా పుష్ప జోసఫ్, ప్రిన్సిపాల్ డి సూర్యశంకర్‌రావు, గౌరవ సంఘ సభ్యులు స్వామి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ప్రసాదరావు పాల్గొన్నారు.

అనంతగిరి: చిలకగెడ్డ బాలుర ఆశ్రమల పాఠశాలో యూటీఎఫ్ క్యాలెండర్‌ను మండల అధ్యక్ష కార్యదర్శులు వివి ఈశ్వరరావు, నరాజీ. మల్లేశ్వరరావు అధ్యక్షతన ఎంఈఓ కిల్లో. బాలాజీ. కూడ. వెంకటరమణ చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సహా అధ్యక్షులు శెట్టి రాంబాబు, జిల్లా కార్యదర్శి పుడిగి దేముడు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రూపొందించిన 2025 నూతన సంవత్సర డైరీ, కేలండర్‌ను ఎటపాక ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, ఎంఇఒ లక్ష్మీ నారాయణ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ ఎటపాక మండల ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులందరికీ నూతన సంవత్సర, సంక్రాతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు విజయ్, నాయకులు బద్ది ప్రసాద్, రాజేంద్రప్రసాద్, బాలకోటయ్య, రమాదేవి, రత్నరావు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాకలో కేలండర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ ప్రతినిధులు

ఎటిఎ కేలండర్ ఆవిష్కరణ

కూనవరం : స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఎటిఎ) కేలండర్‌ను, స్టిక్కర్ కేలండర్‌ను మండల విద్యాశాఖ అధికారులు వివి.లక్ష్మీనారాయణ, తుర్రం లక్ష్మయ్య చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజలు, ఎస్ఎంసిల సహకారంతో ఏజెన్సీ ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎటిఎ జిల్లా అధ్యక్షులు సరియం అనిల్ కుమార్, సహాయ కార్యదర్శి చట్టం వీరయ్య, మండల అధ్యక్షులు జితేంద్ర, మహిళా కార్యదర్శులు సోడే దుర్గ, పాయల భవాని, సోడే జయమ్మ, మడకం సుజాత, కుంజ జితేంద్ర, బొడ్డు శ్రీను, కుంజా సత్యనారాయణ పాల్గొన్నారు.

'పీసా చట్టాన్ని ఉల్లంఘిస్తే కేసులు'

ప్రజాశక్తి-చింతపల్లి : షెడ్యూల్డ్ ప్రాంతంలో పీసా చట్టాన్ని ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు పెడతామని ఆంధ్ర ప్రదేశ్ ఆదివాసీ జెఏసి రాష్ట్ర వైస్ చైర్మన్, భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు అన్నారు. పీసా చట్టం గురించి తెలిసిన వారు పీసా కమిటీలో ఉంటే పీసా చట్టం సక్రమంగా అమలవుతుందని విలేకర్లతో అన్నారు. ఆదివాసేతరలు పీసా కమిటీలలో నెగ్గాలని తాపత్రయం పడుతున్నట్లు తెలిసిందన్నారు. చట్టాలపై కనీస అవగాహన లేని వారిని పోటీలో పెట్టి ఎన్నికల్లో గెలవాలని కొంతమంది రాజకీయ నాయకులు అనుకొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసి నాయకులు పాడి లోవరాజు, శ్యామల వరలక్ష్మి, బూరుగులయ్య, బూరుగుల వెంకట్రావు, రీమెల పాలు, లకే రామచంద్రుడు, కోర్రు బాబురావు, లోత పద్మ శ్రీను, అశోక్ లాల్, శంకురమ్మ పాల్గొన్నారు.

6న జాబ్ మేళా

ప్రజాశక్తి - చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈనెల 6న నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయభారతి కోరారు. గురువారం ఆమె మాట్లాడుతూ , ఫోక్స్ కాన్, మదర్ సన్ సుమీ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీలతో పాటు, డేటా ప్రో కంపెనీలు ఈ జాబ్ మేళాకు విచ్చేయుచున్నాయన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమో, ఐటిఐ తదితర విద్యను అభ్యసించిన 19 ఏళ్ల నుండి 32 ఏళ్లలోపు నిరుద్యోగులు ఈనెల 5వ తేదీ లోపు కళాశాల పని దినాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ఈ కంపెనీలలో శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి నెలకు18 వేల వేతనం పొందేలాఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.

విశాఖ పోర్టు, ఆర్‌విఎన్ఎల్ మధ్య ఒప్పందం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్, విశాఖపట్నం పోర్టు మధ్య రూ.300 కోట్ల విలువైన ప్రాజెక్టుకు సంబంధించి గురువారం ఎంఒయు జరిగింది. పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు సమక్షంలో పోర్టు, ఆర్‌విఎన్ఎల్ ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. సరుకు రవాణాకు సంబంధించి ట్రాఫిక్ నిర్వహణలో సమగ్ర పరిష్కారానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. పోర్టు, నగరాన్ని కలిపే కూడళ్ల సమీపంలో రోడ్డు, రైలు రవాణాకు అవరోధాలను తొలగించేలా, వాహనాలు ఎటువంటి ఆటంకం లేకుండా పోర్టులోకి ప్రవేశించడం, నిష్క్రమించడానికి వీలుగా ఈ ప్రాజెక్టుకు రూప కల్పన చేశారు. ఒప్పందంలో భాగంగా సీ-హార్స్ జంక్షన్ నుంచి డాక్ ఏరియా వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. ప్రస్తుతం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 11 లెవెల్ క్రాసింగ్‌లను తొలగించి, సరుకు రవాణాను సాఫీగా కొనసాగించడానికి వీలుగా నిర్మించనున్నారు. ఈ వంతెన పొడవు 3.341 కిలోమీటర్ల రోడ్డు వెడల్పు రెండు లైన్‌లకు 7 మీటర్లు, మూడు లైన్లకు 10.5 మీటర్లు చొప్పున ఉండనుంది. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్ కుమార్ దూబే, పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

నేవీ విన్యాసాలు అదుర్స్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : తూర్పు నావికాదళం ఈ నెల 4వ తేదీన నిర్వహించతలపెట్టిన నేవీ డే వేడుకలను పురస్కరించుకొని గురువారం సాయంత్రం బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వేదికగా నేవీ ఆపరేషన్ డెమో ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ నిర్వహించారు. రిహార్సల్స్‌లో తూర్పు నావికాదళానికి చెందిన హాక్ యుద్ధ విమానాలు, చేతక్ హెలికాప్టర్లు, యుద్ధనౌకలు, సబ్ మెరైన్లు పాల్గొన్నాయి.

భద్రతా ఏర్పాట్లు పూర్తి

బీచ్ రోడ్డులో ఈ నెల 4వ తేదీన నిర్వహించే నేవీ డే వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, పలువురు కేంద్ర మంత్రులు, నావికా దళ ప్రధాన అధికారులు హాజరు కానున్న తరుణంలో బీచ్ రోడ్ ప్రాంతంలో పోలీస్ పహారా పెంచారు. సుందరీకరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాలను పలువురు నేవీ అధికారులతో పాటు విశాఖపట్నం జిల్లా కలెక్టర్, జివిఎంసి కమిషనర్, సమీక్షించారు. ఇప్పటికే పోలీస్ శాఖ ఉన్నతాధికారులు నాలుగో తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బీచ్ రోడ్‌ను మూసివేస్తున్నామని, ట్రాఫిక్ నిబంధనలు అమల్లో ఉంటాయని ప్రకటించారు.

సేంద్రీయ వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి - చింతపల్లి : కేంద్ర వ్యవసాయ శాఖ పథకం కింద సమేతి ఆంధ్ర ప్రదేశ్, విశాఖపట్నం కు చెందిన ఆత్మ సహకారంతో స్థానిక (చింతపల్లి) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద సేంద్రియ వ్యవసాయంపై ఆరు రోజుల నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని ఆ పరిశోధనా స్థానం సహ సంచాలకులు డాక్టర్ ఏ అప్పలస్వామి ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. గ్రామీణ యువతలో వ్యవసాయ, వ్యవసాయానుబంధ రంగాలలో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంతో వారు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉండి స్వయం ఉపాధి పొందే మార్గాలకు అవకాశం కల్పించడానికి ఈ నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎం శరత్ చంద్ర మాట్లాడుతూ, పంట రుణాలను కేవలం వ్యవసాయం అవసరాల నిమిత్తమే వాడుకొని అధిక దిగుబడులను సాధించి, సకాలంలో రుణాలు తిరిగి చెల్లించినట్లయితే వడ్డీ మాఫీ పొందే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ విశ్వ విద్యాలయ ఆర్ఇఏసి సభ్యుడు వండలం బాలయ్య మాట్లాడుతూ, రసాయన పదార్థాలు వినియోగం చేయకుండా సేంద్రీయ పద్ధతుల ద్వారా లేక ప్రకృతి సేద్య విధానాలతో సాగు చేయాలన్నారు. మార్కెటింగ్ చేసే అవకాశాన్ని పాడేరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త ప్రదీప్ కుమార్ వివరించారు. సుమారు 25 మంది ఔత్సాహిక యువతి, యువకులు శిక్షణా కార్యక్రమంలో మెలకువలు నేర్చుకుంటున్నారని పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, నైపుణ్య శిక్షణ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ పి.బాల హుసేన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు కే బయ్యప్ప రెడ్డి, సందీప్ నాయక్, వెంకటేష్ బాబు, జోగారావు, పాలిటెక్నిక్ కాలేజీ సిబ్బంది, గ్రామీణ యువత పాల్గొన్నారు.

నేడు విశాఖలో ఇన్‌ఛార్జి మంత్రి డోలా పర్యటన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి శుక్రవారం పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన ఖరారైంది. శుక్రవారం ఉదయం ఉత్తరాంధ్ర జిల్లాల సోషల్ వెల్ఫేర్ డీడీలు, ఎస్‌సి కార్పొరేషన్ ఈడీతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో అధికారులు, కూటమి నేతలతో ఈ నెల 8న ప్రధాని మోడీ విశాఖ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తారు.

పంచనామా ప్రాతిపదికన మ్యుటేషన్

మాట్లాడుతున్న సర్పంచ్ చినబాబు

సర్పంచ్ చినబాబు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:- రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సుల్లో గిరిజన ప్రాంతంలో పట్టా మ్యుటేషన్ డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబెర్ సర్టిఫికెట్‌ను మినహాయించి పంచనామా నిర్వహించి దాని ప్రాతిపదికన ప్రకారం పట్టా మ్యూటేషన్ నిర్వహించాలని సంకరమెట్ట సర్పంచ్ జి.చిన్నబాబు కోరారు. గురువారం అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయతీ కిన్నాంగుడ గ్రామంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఉద్దేశించి సర్పంచ్ చిన్నబాబు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సుల్లో పట్టా మ్యుటేషన్ చేసుకోవడానికి డెత్ సర్టిఫికెట్ అనుసంధానం చేయడంతో మూడు తరాల నుండి పట్టా మ్యూటేషన్ చేసుకోలేని రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. మ్యూటేషన్ చేసుకోవడానికి రైతులు తండ్రి డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అడుగుతుండడంతో గిరిజన ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు దగ్గర తమ తల్లి దండ్రుల మరణించినప్పుడు డెత్ సర్టిఫికెట్ తీసుకోవాలని అవగాహన లేకపోవడం తో పొంద లేక పోయారని తెలిపారు.ప్రస్తుతం లీగలైజ్ సర్టిఫికెట్ పొందాలంటే ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరిగే ఓపిక లేక చాలా మంది రైతులు పట్టా మ్యూటేషన్ చేసుకోలేక పట్టా పాస్ పుస్తకాలు పొందలేక పోతున్నారన్నారు. ఆర్ఐ గోవింద్, విఆర్ఓ అమ్మలు, సర్వేయర్ మనీషా, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కెశోబో, సిహెచ్ గురుమూర్తి పాల్గొన్నారు.

చింతపల్లి : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని బలపం పంచాయితీ సర్పంచ్ కె రమేష్ నాయుడు తెలిపారు. గురువారం పంచాయతీలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. పాస్‌పుస్తకంలో పేరు మార్పులు, ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, కూటమి నాయకులు జి అప్పారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సుధారాణి మరణం తీరని లోటు

ప్రజాశక్తి- మాధవధార : కంచరపాలెం జోన్ మహిళా సంఘం కార్యకర్త, సిపిఎం సభ్యురాలు సుధారాణి(50) మరణం పార్టీకి, మహిళా లోకానికి తీరనిలోటని పలువురు అభిప్రాయపడ్డారు. రెడ్డి కంచరపాలెంలో నివాసముంటూ 20ఏళ్లుగా ఐద్వా, సిపిఎం కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనే సుధారాణి, రెండు నెలల క్రితం అనారోగ్యంతో క్రితం హైదరాబాద్‌లోకి కొడుకు వద్దకు వెళ్లారు. డిసెంబర్ 31న హఠాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందారు. మృతదేహాన్ని బుధవారం సాయంత్రం కంచరపాలెం తీసుకొచ్చారు. సుధారాణి పార్థివదేహంపై సిపిఎం జెండాను కప్పిన తర్వాత పలువురు పార్టీనేతలు, మహిళా సంఘాల ప్రతినిధులు నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

2006లో భూపోరాటంలో పాల్గొన్న సుధారాణి, రెడ్డి కంచరపాలెంలో స్థానిక సమస్యలపై పని చేశారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ, పార్టీ నాయకులు ఎస్. సోమేశ్వరావు, పి .వెంకటరావు, ఒ.అప్పారావు, ఐద్వా నాయకులు ఎం.సుజాత, కె. అనురాధ, ఓ.విజయ, ఎం. కల్యాణి, వై. సత్యవతి, ఎం. లక్ష్మి ఉన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

నిరసనలో మాట్లాడుతున్న రమణ

ప్రజాశక్తి- ములగాడ : పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని, భారతజాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం జివిఎంసి 59వ వార్డు శ్రీహరిపురం వాకింగ్ పార్కు వద్ద సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో అమిత్ షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు కె.రమణ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అమిత్ షా, రాజ్యాంగ నిర్మాతనే చట్టసభలో అవమానించడం దుర్మార్గమని, కేంద్రమంత్రి పదవికి అమిత్‌షా అనర్హుడన్నారు. వెంటనే కేంద్ర హోంమంత్రి పదవి నుంచి వైదొలగాలని, లేకుంటే రాష్ట్రపతి జోక్యం చేసుకుని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కుల వ్యవస్థ వ్యతిరేక పోరాట సంఘం కార్యదర్శి కె.పెంటారావు మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలపై ప్రధానమంత్రి మోడీ స్పందించడం పోవడం బాధాకరమన్నారు తక్షణమే అమిత్‌షాపై చర్యలు చేపట్టకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో సిపిఎం జోన్ నాయకులు ఆర్ లక్ష్మణమూర్తి, కార్యకర్తలు బి రాంబాబు, ధనాల రాము, బి సూరిబాబు, గంగులు, శ్రీను, కృష్ణారావు, తిరుపతిరావు, గొల్ల బాబు, లక్ష్మి, సింహాచలం పాల్గొన్నారు.

110 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలోని అడ్డురోడ్డులో 110 కిలోల గంజాయి పట్టుకున్నట్లు సిఐ లొడ్డు రామకృష్ణ తెలిపారు. పక్కా సమాచారం మేరకు అడ్డురోడ్డులోని వేంకటేశ్వర లాడ్జి వెనుక లేఅవుట్‌లో అనుమానాస్పదంగా కారు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, ఇన్‌ఛార్జి ఎస్ఐ ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు వెళ్లి తనిఖీలు చేపట్టారు. కారులో 110 కిలోల గంజాయితోపాటు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.300నగదు, కారును స్వాధీనం చేసుకున్నారు. .నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

భారతీయ కళారూపాల సంరక్షణ అవసరం

ప్రజాశక్తి- మధురవాడ : ఆధునిక ప్రపంచంలో భారతదేశ సంపన్న, సాంస్కృతిక వారసత్వం, విభిన్న సంప్రదాయాలు ప్రమాదంలో ఉన్నాయని అమెరికన్ రచయిత, నర్తకి, పండితురాలు డాక్టర్ రొక్సాన్న కామయాని గుప్త ఆందోళనను వ్యక్తం చేశారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఫైన్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో "ఆధునిక భారతీయ కళలు,సాంప్రదాయాల పరిరక్షణ' అంశంపై సమావేశంలో మాట్లాడుతూ భారతీయ కళారూపాలలో తత్వశాస్త్రం, యోగా అంతర్లీనంగా ఉన్నాయన్నారు. దేశ సాంస్కతిక సారాన్ని పరిరక్షించే భారతీయ సాంప్రదాయ కళారూపాలు భారతదేశ గొప్పదనాన్ని విశ్వవేదికపై చాటే రాయబారులుగా పనిచేశాయన్నారు. భారతీయ నత్యరూపాలు ప్రజల ఆలోచనాశక్తిని ప్రతిబింబిస్తూ, శారీరక ఆరోగ్యం, మానసిక శ్రేయస్సును ప్రోత్సహించడంలో ప్రత్యేకంగా నిలుస్తున్నాయన్నారు. వేదకాలం నుంచి భారతదేశ సంస్కతిలో అంతర్భాగంగా ఉన్న వివిధ కళారూపాలు బ్రిటీషర్ల పాలనలో సహితం చెక్కుచెదరలేదన్నారు. అమెరికా సహ ప్రపంచంలోని ఎందరినో ఆకర్షించాయన్నారు. బ్రిటీషర్ల ఆంక్షలు సైతం భారతీయ కట్టు,బొట్టు, సంస్కృతిని ప్రభావితం చేయలేకపోయాయన్నారు. సంగీత నాటక అకాడమీ వంటి సంస్థల కారణంగా భారతీయ కళలు ఇప్పటికీ ప్రాభవాన్ని కోల్పోకుండా నిలిచి ఉన్నాయన్నారు.

భారతీయ కళారూపాల పరిరక్షణలో యువత ఆసక్తి కోల్పోతున్నారని, డబ్బు సంపాదనపైనే ప్రాధాన్యత పెరిగిపోతోంద ఆందోళన వ్యక్తం చేశారు. పాశ్చాత్య దేశాల్లో వారిచ్చే సంపద కోసం భారతీయ యువత అర్ధరాత్రిపూట కూడా ఉద్యోగం చేయడాన్ని ఎత్తి చూపారు. సాంప్రదాయ భారతీయ సినిమాలు ఆధునిక సినిమాల మధ్య తేడాను వివరించి, ఇటీవల వస్తున్న కొన్ని సినిమాలలో నేరస్తులను హీరోలుగా చూపడం సమాజంపై దుష్ప్రభావాన్ని చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజ విలువలపై ప్రభావం చూపగల కళారూపాలుగా సినిమాలను పరిగణించాలన్నారు.

అమెరికన్ ప్రొఫెసర్ డాక్టర్ గుప్తను సత్కరిస్తున్నగీతం ప్రతినిధులు

భారతీయ కళలపై విద్యార్థులు అవగాహనతో పాటు అభిరుచి, ఆసక్తిని పెంచుకుని, వాటిని నేర్చుకోవడం ద్వారా దేశ సంప్రదాయాలను కాపాడాలని డాక్టర్ గుప్త సూచించారు.
గీతం ఫైన్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.మాల్యద అధ్యక్షత వహించిన సమావేశంలో విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ ప్రొఫెసర్ బాలకుమార్, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ నళిని బిక్కిన పాల్గొన్నారు.

నూతన ఎంఇఒకు యుటిఎఫ్ నేతల అభినందనలు

నూతన ఎంఇఒను అభినందిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-విఆర్.పురం: విఆర్.పురం మండల విద్యాశాఖధికారి-2గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన చిచ్చడి బాబురావును యుటిఎఫ్ మండల కమిటీ నాయకులు గురువారం రేఖపల్లిలోని ఎంఈఓ కార్యాలయంలో కలిసి పుష్ప గుచ్చం ఇచ్చి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం బాబురావుకు, ఎంఈఒ-1 వివి.లక్ష్మీనారాయణకు యుటిఎఫ్ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో విద్యార్థులకు మెనూ సమస్యలు ఎక్కువగా వచ్చాయని, అవి లేకుండా చూడాలని, పాఠశాలలు కొన్ని శిథిలావస్థకు వచ్చాయని, వాటికి మరమ్మతులు చేయించాలని ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి స్పందించిన ఎంఇఒలు బాబురావు, లక్ష్మీనారాయణ ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పైఅధికారులకు తెలియజేసి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు యస్.రామకృష్ణ, బి.రవికుమార్. యం.బాబు, యస్.అజయకుమార్, ఎ.రాము, యన్.ప్రసాద్, యం.వీరయ్య, యస్.బాలారెడ్డి, పి.గురు సాయి నవీన్, రజిని కుమార్ రెడ్డి, యన్.చిన్నబొజ్జి తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఎటపాక : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో జరగనున్న స్వర్ణోత్సవ సభలు, 17వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చెయ్యాలని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు భద్రాచలంలోని యుటిఎఫ్ హోమ్‌లో సంఘం జెండాను యుటిఎఫ్ సీనియర్ నాయకులు బద్ది ప్రసాద్ గురువారం ఆవిష్కరించారు.

అనంతరం మహాసభల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు విజయ్ మాట్లాడుతూ 50 సంవత్సరాల నుండి నిత్యం ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతున్న అగ్రగామి సంఘంగా యుటిఎఫ్ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, సాగర్ ప్రసాద్, ప్రియాంక, సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

బడుగుల విద్యా భవిష్యత్‌తో ఆడుకోవద్దు

ప్రజాశక్తి- సీతమ్మధార : తెలుగు భాషా వికాసం ముసుగులో బడుగుల విద్యా భవిష్యత్తును నాశనం చేయొద్దని విదసం ఐక్యవేదిక రాష్ట్ర సమితి కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ఆంగ్లమాధ్యమం ఆపేస్తే ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు అంగీకరించబోరని హెచ్చరించారు.
విదసం ఆధ్వర్యంలో దళిత సంఘాల సమావేశంలో మాట్లాడుతూ, ఇటీవలి ప్రపంచ తెలుగు మహాసభల తీర్మానాలు, చర్చల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం రద్దు చేయాలని ప్రస్తావన వచ్చిన నేపథ్యంలో ఆయా తీర్మానాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవద్దని, ఇంగ్లీష్ మీడియం కొనసాగించాలని డిమాండ్ చేశారు.
దళితులు అగ్రభాగాన అండగా నిలిచి కూటమి ప్రభుత్వానికి విజయం అందించారని, అటువంటి బడుగుల పిల్లలకు ఇంగ్లీష్‌మీడియం విద్యను దూరం చేయొద్దన్నారు. తెలుగు మహాసభల్లో ఇంగ్లీష్ మీడియంపై విషం కక్కిన వారి పిల్లలు ఎక్కడ చదువుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధానన్యాయమూర్తి ఎన్‌వి రమణ వంటి వారు ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం వద్దనడం సముచితం కాదన్నారు. ఇంగ్లీష్ మీడియం రద్దుతో తెలుగు భాష పరిరక్షణ సాధ్యం కాదన్నారు
తెలుగు భాషా వికాసం కోసం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో అన్ని విభాగాల్లో తెలుగును ప్రధాన సబ్జెక్టుగా చేర్చాలని. ప్రభుత్వ ఉత్తర్వులు, కోర్టు తీర్పులు, పోలీసుల ఎఫ్ఐఆర్‌లు, ఛార్జిషీటులు తెలుగులోనే రావాలన్నారు.. తెలుగు కవులు, కళాకారులకు ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా, వారికి ప్రత్యేక పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సోడదాసి సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాజి ఓంకార్, బూల భాస్కరరావు, గొల్లమాల అప్పారావు, వి.దుర్గారావు, మూర మహేష్, కస్తూరి వెంకటరావు, రవి సంతోష్, రవి శేఖర్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్, ఫార్మశీ విద్యార్థులకు రీసెర్చ్ పార్కులు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- మాధవధార: రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులకు రీసెర్చ్ పార్కులు ఏర్పాటు చేయాలని ఎపిసిసి జనరల్ సెక్రటరీ మూల వెంకటరావు సూచించారు. శాస్త్ర సాంకేతిక, పరిశోధన రంగాల్లో నైపుణ్యాల సాధనకు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందడానికి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా రూపొందడానికి ఇంజనీరింగ్,ఫార్మసీ విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా రీసెర్చి పార్కులను ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసి నిర్వహించాలన్నారు. వైద్యవిద్యలో రెండేళ్ల క్లాస్‌రూం పాఠాలు తర్వాత, వైద్యకళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రిలో రోగుల సేవల్లో ప్రత్యక్షంగా పాల్గొనడం, వైద్యనిపుణులు, సీనియర్ల నుంచి ప్రాక్టికల్‌గా వైద్యవిద్యకు సంబంధించిన నైపుణ్యం పొందేలా కరిక్యులమ్ అమలవుతోందన్నారు. దీంతో వైద్య విద్య పూర్తయిన తర్వాత ఉద్యోగాలు రాకున్నా, చదువకునే సమయంలో గడించిన అనుభవంతో క్లినిక్‌లు, ప్రయివేటు ప్రాక్టీస్‌లు నడుపుకునే సత్తాను సాధిస్తారన్నారు.

అదే తరహాలో ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థులకు చదువుకునే సమయంలో జీవననైపుణ్యాలను సాధించేలా రీసెర్చి పార్కులు వంటిని నెలకొల్పాలని, తద్వారా విద్యా దశకు, ఉద్యోగ దశకు మధ్య అంతరాలు తగ్గుతాయన్నారు. ఉద్యోగం, ఉపాధి కోసం ఎదురుచూడకుండా స్వయంఉపాధితోనైనా జీవనం సాగించేలా ఇంజనీరింగ్, ఫార్మశీ విద్యార్థులను తీర్చిదిద్దే చర్యలపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపి రీసెర్చి పార్కులు ఏర్పాటు అంశాన్ని పరిశీలించి, కార్యరూపంలోకి తేవాలని మూల వెంకటరావు కోరారు.

దంపతుల ఆత్మహత్య

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు కృష్ణ రాయపురం, బాలాజీనగర్‌లో గురువారం తెల్లవారుజామున దంపతుల ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎస్ఐ ఆసిరి తాత తెలిపిన వివరాలివి.

ఒక ప్రైవేటు మెడికల్ స్టోర్‌లో పనిచేస్తున్న డబ్బీరు సంతోష్ (36), ఉషశ్రీ (27) దంపతులు స్థానికంగా నివాసముంటున్నారు. వీరికి ఆరేళ్ల క్రితం వివాహమైంది. పిల్లలు లేరు. కారణాలు తెలియనప్పటికీ, బుధవారం రాత్రి వారు నివాసముంటున్న ఇంట్లోనే ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. గురువారం ఉదయం గమనించిన స్థానికులు 112 ఫోను చేసి పోలీసులకు సమాచారమివ్వడంతో స ంఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతికి గల కారణాలపై ఆరా తీశారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరిన గాజువాకకు చెందిన మృతుల బంధువులను పోలీసులు విచారించారు. వీరి మరణానికి ఆర్థిక ఇబ్బందులే కారణమని భావిస్తున్నారు. లేకుంటే ఆరేళ్ల క్రితం పెళ్లయినప్పటికీ పిల్లలు లేకపోవడంతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.